# పండ్లచెట్టుకు ముండ్లకంప

శ్రీ పరిగొండ సత్యనారాయణమూర్తి

మంత్రులు, సేనాపతులు, పండితులు, ఆశ్రితులు సముచితాసనములందుపవిష్టులై యుండ, విక్రమసేనమహారాజు కొలువుతీరి యున్నాడు. ముఖ్యమిత్రుడు చలపతిమహారాజు చెంగటనే గూర్చుని యున్నాడు.

మంత్రులు సలహాలనిచ్చుచున్నారు. సేనాధిపతులు స్వపరాక్రమముల నుగ్గడించుచున్నారు. పండితులు పాండితిని బ్రకటించుచున్నారు. ఆశ్రితులు మనవులుచేయుచున్నారు. ప్రసన్నవదనముతో మహారాజువినుచు, తగురీతి ముదలనిచ్చుచున్నాడు. మహారాజుకు సరాసరి దక్షిణభుజమగు చలపతి సభికుల చేష్టలకు లోలోన చీదఱించుకొనుచున్నాడు. ఆతని కనుబొమలు ముడివడుచున్నవి. "సార్వభౌమా! తెల్లనివన్నియు పాలని, నల్లనివన్నియు నీరని తలంచుట రాజనీతి కాదు. పచ్చనిదంతయు పైడి కానేరదు" అని చేతులు త్రిప్పుచు చలపతి చెప్పినాడు. మహారాజు మందహాస మొనరించినాడు.

రాజ్యాంగవేత్తలగు మంత్రులకు తలకొట్టినట్లయినది. సమరవిద్యాధురీణులగు చమూపతులకు నడుము విఱిగినట్లయినది. పండితుల ముఖములు, ఆశ్రితుల యాననములు తెల్లపోయినవి. చలపతిముందు వారి మాటలు మహారాజు చెవికెక్కినవి కావు. కాని, వారికిట్టిపరాభవము లీనాడు క్రొత్తవెనగదా! మహారాజునకు చలపతి సాహచర్య మబ్బిననాటినుండి రాజుగారు వానివాగురులయందు దగుల్కొనినాడు. ఆ పాపిష్ఠుని చేత కీలుబొమ్మయైనాడు. రాణివాసముననుండు నొక్క రాత్రివేళలదప్ప నీడవలె రాజుగారిని చలపతిచేరి యుండువాడు.

గులాబిపువ్వునకు బుట్టుకతో ముల్లు దాపురించినది. కడలికడుపునుండి వెలువడుటయే తడవుగా, చందమామకు గళంక మాపాదిల్లినది. గుణము దోష సంస్కారముచే లేశమైనది. మహారాజుగారి సౌజన్యము, చలమతి యవమతిచే కలుషితము కాజొచ్చినది. ఇంతకును, చలపతికి సాహిత్యము సున్న; సంగీతము పూర్ణానుస్వారము; ధైర్యపరాక్రమములు నాస్తి; సురూపము కుందేటికొమ్ము; సద్గుణము గగన కుసుమము; కులము చాలదు; గోత్రములేదు. ఎన్నికకువచ్చు గుణము వాని వద్ద మచ్చునకైన లేదు. ఇక ఏమి చూచి, మహారాజు వాని నెయ్యము నపేక్షించినాడు? ఏమో; ఎందులకో; ఆ సంగతి ఆయనకే తెలియవలయును. అవనీపతులును, అతివలును ఆశ్రితపక్షపాతులు గదా! ఇది కొంతకుగొంత సమాధానమైన గావచ్చునేమో!!

మహారాజును చలపతియు గుఱ్ఱములపై యథాప్రకారముగా సాయం సమయ విహారమునకు దరలినారు. వారొక కొండ నెత్తమ్మున నాసీనులైయుండ భూసురుడొక డచటికి వచ్చి పనస చెప్పి 'మహారాజాధిరాజా! రవిసమతేజా! ఆశ్రితకల్పభూజా! అభినవ భోజా! తమకు సర్వశుభములు కలుగుగాక! మీకీర్తి కకుబంతవ్యాప్తి నందుగాక! మీ విశాల సామ్రాజ్యము? మదిగ్దంతులు భరించుగాక!' అని అలంకారపూర్వ

కముగ దీవించి శుభాక్షతల శిరస్సున నుంచినాడు. మహారాజు మాటలాడు లోపల, చలపతి యడ్డు తగిలి 'ఏమయ్యా! బ్రాహ్మణుడా! అంతంతగా మహారాజు గారిని పొగడి, దీవించి, వారికడనుండి బహుమతినంది బాగుపడుటకు బదులు, నీకై నీవే దీవించుకొని, నీ నెత్తిపైననే యీ శుభాక్షతల నిడుకొనిన యెడల, ఆ భోగభాగ్యములు నీకే రావా, నీవే బాగుపడవా?' అని హేళనగా పలికినాడు. వయస్సుని వాక్చాతుర్యమునకు విక్రమసేన మహారాజు ముసిముసి నవ్వులు నవ్వినాడు. బ్రాహ్మణుడు గడుసరి. కుక్క కాటుకు చెప్పుదెబ్బ కొట్టవలయునని నిశ్చయించినాడు. తెగించినాడు. మఱి అట్టివారికి తెడ్డేలింగముగదా! 'చిత్తము. మీమాట యందును నిజము లేకపోలేదు' మీ గేదెకు మీరేగడ్డివేసి, మీరే కుడితిపెట్టి, మీరే పాలుపిండి, మీరే త్రాగుటకుబదులు, మీరే ఆ గడ్డి తిని, మీరే ఆ కుడితి త్రాగినయెడల, ఆ పాలు మీ కడుపునందే యూరి మీ కడుపు నిండదా? నా మాట తప్పయిన క్షమించండి' అని ఆ బాపడనినాడు. దిక్కులు పిక్కటిల్లునట్లు మహారాజు నవ్వినాడు. చలపతి మోము చిన్నపోయినది. ఆతనికి చెంపపై చెళీమని కొట్టినట్లయినది. 'ఏమో! చాపల్యమున పలికినాను. అపరాధమును మన్నించండి. సార్వభౌమా! నేనొక దేవళమును నిర్మించు తలంపున మీ యట్టి దాన కర్ణుల నాశ్రయించుచున్నాను' అని బ్రాహ్మణుడు మనవి చేసికొనినాడు. మహారాజు మాట్లాడులోపల చలపతి "అవునయ్యా! పెట్టువాడుండిన అడుగువారికి తక్కువ లేదు. మడువులో నీరుండిన కప్పలకు కొదువలేదు. సరియే పొమ్ము. దేవళమంతయు కట్టించినపిదపరమ్ము. గాలిగోపురముపై కలశస్థాపనకగువ్యయము మహారాజుగారివంతు" అని యుక్తియుక్తముగ పల్లవిత్తిచినాడు. మఱి మహారాజు బెల్లముకొట్టిన ఱాయిరీతి పెదవి కదపలేదు. బ్రాహ్మణుడు లేచిపోయినాడు. "ఈ దొంగ బ్రాహ్మణుడు అసలు దేవళము కట్టించినగదా, గాలిగోపురముపై కలశస్థాపనజేయుట! అంతయు కలిమాయ. పొట్టకూటికి పుట్టెడువేషాలు" అని చలపతినవ్వి, రాజు గారిని నవ్వించినాడు.

వారులేచి పురమునకు తిరిగివచ్చునపుడు మార్గమధ్యమున మాదిగ యామడుదూరముగా సాగిలబడి "ఏలినవారిదర్శనంకోసం తపించి పోతున్నాను. నేటి కబ్బింది. ప్రభువులకోసం యీ కూలిజోళ్లను తయారు చేశాను. ఈలాటి అందచందాలతోనుండే జోళ్లను కుట్టినవాండ్లు యిప్పటికిలేరు. ఇక నుండబోరు. మహారాజులు కటాక్షించాలి" అని మనవి చేసికొన్నాడు, మిత్రులిద్దఱు ప్రసన్నవదనములతో చెరియొకజోడు తొడుక్కొని తరలినారు. "ఒరే! యామా! రేపువచ్చి మాకగపడు" అని చలపతి చెప్పినాడు.

ఇది చలపతి తులిపిచేష్టల కొక్క తార్కాణముమాత్రమే. నానాట చలపతిచర్యలు దుస్సహములు కాసాగినవి. చెడుకార్యముల జోలికి పోవునో పోవడో కాని, మహారాజు మంచికార్యమును తలపెట్టుటయే తడవుగా, నే నున్నానని పానకములోని పుడకవలె చలపతి యచట సాక్షాత్కరించువాడు. బీదలకని భూపతి బానెడుపాలను సిద్ధముచేసిన, చలపతిచలమున పరమాణువంత పాషాణము నందు విడచువాడు. చిత్రమేమన, ఎట్లో తనచెయిదమును సమర్థించి చలపతి మహారాజుగారి మెప్పొందుచుండును; అదేమి మచ్చుమందుచల్లినాడో, అదేమి మోహనమంత్రమును ప్రయోగించినాడో, చలపతిగీచినగీటును దాటుట యెట్టిదో మహారాజెఱుంగనే యెఱుంగడు.

ఇట్టివారి స్నేహబంధమునకు పురాకృతమున వారి బాంధవ్య మెట్టిదో!!

ఊరూనాడూ యెచ్చట వినినను ఇదియే ముచ్చట; ఇదియే మాట. రాజహితైషులు, సచివోత్తముని యింట రహస్యముగా సభచేసినారు. ఎంతయో, ఎన్నియో రీతుల నాలోచించినారు. దురాత్ముడగు చలపతినుండి మహారాజును వేరుచేయుటకు గల వెఱవు యెవ్వరికిగాని తోచలేదు. కడకు ముసలిది అంతఃపురమునం దూడ్పుడుకత్తెగా పనిచేయు

(తరువాయి 39-వ పేజీలో)

(14-వ పేజీ తరువాయి)

చుండు రామక్క, చంటిబిడ్డను మనుమడిని చంకలో బెట్టుకొని, తానును ఒక మనిషివలె లేచి నిలువబడి యేమియో మనవిచేయ నెంచినది. సచివోత్తముడు చూచి 'రామక్కా! నీవు రాజసేవయందు ముసలిదానవైతివి. అనుభవపరురాలవు. మహారాజుగారి యోగక్షేమముల నారయుదానవు. చెప్పదలంచినదేదియో చెప్పుము' అని ప్రోత్సహించినాడు.

"స్వామీ! నాకొక యుపాయము తట్టుచున్నది. కాని దానివలన నెవ్వరికిగాని—తుదకు దుర్మార్గుడగు చలపతికి సైతము—అపాయము రానీయనని తాము అభయమిచ్చినయెడల, అందుకు మీ ప్రజ్ఞ నుపయోగించినయెడల, ఆంతర్యమున మనవిచేయుదు' నని రామక్క వణకు గొంతుతో చెప్పినది. 'సెబాస' ని సచివోత్తముడు సభ చాలించి రహస్యముగా రామక్కతో నేమేమియో యాలోచించి, ఆమెను పంపివేసినాడు. 'కడకు చీమతో దోమతో కూడా ఒక్కొక్కప్పుడు పని యుండుననుట కిది యొక నిదర్శనము కాబోలు' ననుకొని సచివోత్తముడు సంతృప్తి నందినాడు.

క్రమము తప్పకుండా నాడుకూడా చలపతి మహారాజుగారితో ఉదయాస్తమానము వేడుకగా గడపినాడు. విక్రమసేన మహారాజు, మిత్రుడు చలపతితో నాడుకూడా సహపంక్తిన షడ్రసోపేతముగా విందారగించి కర్పూరతాంబూల చర్వణ మొనరించినాడు. ప్రొద్దుపోకకు యేదియో లోకాభి రామాయణములోనికి దిగినారు. ఇక మహారాజుగారు లేచి అంతఃపురము వైపు కాలు సాగించినారు. సంభాషణ విషయము తుదముట్టువఱకు చలపతి మహారాజుగారివెంట నడచుచుండినాడు. అంతఃపురముదాక కూడ రాజుగారి ననుగమించవలసివచ్చుటచే, పాదరక్షలతో లోనికిబోవుట అనుచితమనితలంచి, వానిని సింహద్వారముకడ వదలి మహారాజుగారివెంటచలపతి లోనికిబోయినాడు. ప్రభువు కొంతసేపాతనితో మాటలాడి సెలవిచ్చి పంపినాడు. చలపతి తిరిగివచ్చి సింహద్వారమువద్దచూడగా పాదరక్షలు విడిచినచోట కానరాలేదు. ఆమూల నీమూల కొంతసేపు వెతకినాడు. కాని అగపడలేదు. మహారాజుగారి ముఖ్యస్నేహితుడు పాదరక్షలకొఱకు ప్రాకులాడుచున్నాడని యితరులు గమనించిన తనకు సిగ్గుచేటను అభిమానముతో చలపతి యింటికిపోయి శయనించినాడు.

మేల్కొలుపులతో, తూర్యనినాదములతో మహారాజుగారు ప్రొద్దుననే నిదురలేచి, పట్టమహిషి ప్రాసాదమునువీడి వచ్చినారు. సింహద్వారములోనికి వచ్చుటకు రెండవరాణిగారి గదిమీదుగా రావలయును. ఏమియాశ్చర్యము! ఎంతద్రోహము!! మహారాజు తన కన్నులనే తాను నమ్మజాలకపోయినాడు. తాను పాలుపోసి పెంచినపాము తనకే కాటువేయునని మహారాజు కలనైన నెంచలేదు. చలపతి తిన్నయింటివాసములెన్నునంతటి ఛండాలుడని మహారాజున కింతవఱకు తెలియదు. తనతో కలిసిమెలిసి తిరుగు చలపతి ఒకనాడు అంతఃపురద్రోహియౌనని మహారాజు తలంచలేదు. చలపతికిని తన రెండవరాణికిని నేస్తముండు సంగతి మహారాజున కింతవఱకు తెలియనే తెలియదు.........తలపుతోడ మహారాజు హృదయమునకు తుపాకిమందు తగిలినట్లయినది. మానసమల్లకల్లోలముగా నున్నది......ఇది జముకాకున్న, చలపతి చెప్పులజోడు — ఆనాడు మాదిగ యామడిచ్చినవి — రెండవరాణి గదివాకిట నుండుటకు కారణము ? అట్టి చెప్పులజోడు తనకొకటియు, చలపతికొకటియుతప్ప మఱియెవ్వరికిగాని యీ ప్రపంచమునలేదని మహారాజునకు బాగుగాదెలియును.

మహారాజు మండిపడినాడు. చలపతి ద్రోహియనుట కెట్టిసందియముగాని లేదు. అట్టి దుర్మార్గుని యునికి భూమికిభారము ; సంఘమునకు చేటు; తనకు తలవంపులు. అంతఃపురద్రోహికి మరణదండనము శిక్షాస్మృతి విధించుచున్నది. ఇట్లు నిర్ణయించుకొని మహారాజు సేవకునిపిలిచి 'మా మాటగా మంత్రిగారితో చెప్పుము. నేటి సాయంకాలములోపల చలపతి తలను నాకు తెచ్చిచూపవలయును' అని కఠినముగ నాజ్ఞ చేసినాడు.

రాజుల చిత్తములు జవరాండ్రకట్లు క్షణక్షణము మారుచుండునుగదా! మహారాజుగారి యుత్తరువు పట్టణమంతయు ప్రాకినది. రాజభటులు మంత్రిమాట మీద చలపతిని బంధించినారు. పాపము పండినదని పౌరులానందించినారు. దుష్టుడు దండింపబడినాడని జనులు పాయసము త్రాగినారు. ఇక మహారాజు రాహు గ్రహమునుండి తప్పించుకొనిన రాజు రీతి ప్రకాశించునని రాజహితంకరులు రంజిల్లినారు. అందఱకానాడు పండుగగా నుండినది. చలపతి తన దుష్కర్మకు వగచుచున్నాడు. తన పాదరక్షలు రెండవ రాణిగారి గదిద్వారమున నుండ, తాను అంతఃపుర ద్రోహమొనరించినట్లు మహారాజు నమ్మి తనకు మరణ దండన విధించినాడని, దాసిముండ రామక్క వచ్చి చలపతితో చెప్పి వలవల యేడ్చి జొటజొట కన్నీళ్లు కార్చినది. 'నాయనా! ఆ బాల వృద్ధులను నీవు గారించినావు. ఆ గోడు నేటికి నీకు గొట్టినది. మహారాజు మహాత్ముడు; దానరాధేయుడు. అట్టి పండ్లచెట్టుకు ముళ్లకంపవై నీవు ఆశ్రితులకు ఫలములను చెందనీయక చేయుచుంటివి. ఈ చేత చేత, యీ చేత అనుభవము గదా! అని రామక్క మొత్తని చెప్పుతో మొత్తినట్లు చెప్పినది. ఇంతకాలముగా తాను మహారాజుగారి సేవిధముగా చెడు మార్గమున ద్రిప్పుచుండినదియు చలపతికి తెలిసినది. 'రామక్కా! ఇంత కాలముగా నాకు మిన్నుమన్ను తెలియకుండినది—మహారాజుగారి దానహస్తమును దట్టించి పట్టుకొని దీనులను వేధించుచుంటిని. ఒకరిని బాధించుటయనిన నా కొక యాటగానుండినది. నిజమగు నా యధికారము నాకు తెలియక యెగిరి యెగిరి ఒక్కమారుగా క్రింద కూలినాను. రామక్కా? రక్షించుటకు నీవు దక్క నా కిక దిక్కులేరు' అని చలపతి రామక్కను బతిమాలుకొని రెండు చెంపలువేసికొనినాడు. 'దాసీ ముండను, నావలన నేమి కాగలదు. అయినను మహా మాత్యులవా రున్నారుగదా! విన్నవించి చూచెదను. ఇకనైన బుద్ధికలిగి బ్రతుకుము' అని రామక్క చెప్పి పోయినది.

సంక్షుభితహృదయముతో మహారాజు అంతఃపురమున దిరుగుచున్నాడు. రెండవరాణి నేరీతి దండింపవలెనో, రాజుగారు యోచించుచున్నారు. అంతఃపురద్రోహియగు చలపతి యిక మూడుగంటలలో తనవువీడగలదు. అంతలో దుఃఖము—అంతలో సంతోషము—అంతలో ప్రతీకారేచ్ఛ—అంతలో పశ్చాత్తాపము. ఇంతలో పిల్లవానియేడ్పు దాపుననుండి వినవచ్చినది. ముసలిదాసి రామక్క పిల్లవానిని చెళీచెళీయని కొట్టుచున్నది. మహారాజు దాసి దాని మాటలను చెవియొగ్గి వినుచున్నాడు. రామక్క తన మనుమడు బావురుమని యేడ్చుచున్నను దెబ్బమీద దెబ్బ కొట్టుచు "పోకిరికుంకా! చేసేపని నేనుచేస్తుంటే, చెడివేపని నీవు చెడుపుతూంటావా? ముసలిముండను ఎంతకాలమని నీతో వేగగలను? గాడిద కొడుకా! ఎక్కడనో సింహద్వారముబైటనుండే చలపతయ్యగారి చెప్పులజోడును అదిపనిగా తెచ్చి రెండోరాణమ్మగారి గుమ్మంకాడ పడవేస్తావా? ఇక యీలాటిపనులుచేస్తే ప్రాణంతీస్తాను. జాగ్రత్త" అని పెద్దపెట్టున అఱచుచున్నది.

ఒక్కక్షణములో మహారాజునకు నిజము తెలిసినది. తన తొందఱపాటుకు నొచ్చుకొనినాడు. ఒక్కనిముసమాలసించిన, చలపతి యూరక యసువులు బాయుననితలంచి, సేవకుని బిలిచి "మంత్రిగారివద్దకు వాయువేగమున బోయి చలపతిని శిక్షింపవలదని మాయాజ్ఞగా చెప్పుము. చలపతిని విడిచివేయమనుము' అని యాజ్ఞ చేసినాడు.

మహామాత్యులుగారిచే విడుదలనందిన చలపతి యిక రాజ్యముననుండిన ఏక్షణమున కేమికీడుమూడునో యని యెవ్వరికి తెలియకుండ ఎచటికో పాఱిపోయినాడు.

"ఎందుకు పనికిరాని దాసీముండ ముసలి రామక్క యెంతపనిచేసెనో చూచినావా?" అని మహామాత్యులు చమూపతితో రహస్యముగా చెప్పినాడు. సర్వసేనాని ముక్కున వ్రేలిడుకొనినాడు.